Follow: @ANNTELUGU
ANN తెలుగు
29-08-2026
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 234 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## తుమ్మిడిహట్టిపై ఎక్కడా తగ్గొద్దు

నదీజలాల వివాదాల్లో ఎటువంటి రాజీ అక్కర్లే

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

**హైదరాబాద్, మహా :** అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాల్లో ఎటువంటి రాజీ అక్కర్లేదని.. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే తమకు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నీటిపారుదల శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులు, న్యాయ నిపుణులు పాల్గొన్న ఈ సమావేశంలో అంతర్రాష్ట్ర జల వివాదాలు, వివిధ కోర్టులు, బోర్డులు, కేంద్ర సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిసింది. అంతేకాకుండా.. తెలంగాణ ప్రయోజనాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం కలగకుండా పటిష్టంగా వాదనలు వినిపించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సుప్రీంకోర్టు,

మిగతా 3వ పేజీలో


టాప్ న్యూస్



### మోహన్ భగవత్ వెళ్లొచ్చు రేవంత్ వెళ్లకూడదా?

మోదీసర్కార్ పై సీపీఐ నారాయణ ఫైర్

02



### జగన్‌ది దింపుడుకళ్లెం ఆశ

- ఎన్నికలతో రాష్ట్ర రాజకీయ స్థిరత్వం సాధ్యమని వెల్లడి
- స్థానిక ఎన్నికలపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు


02

### రాయదుర్గంలో మరోసారి రికార్డు ధర

ఎకరం రూ. 269 కోట్లకు పలికిన ప్రభుత్వ భూమి




02



### బంగాళాఖాతంలో అల్పపీడనం

02

- తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన
- ఐఎండీ అంచనాలివే



### నేపాల్ వరదలు

- 1924 మంది గల్లంతు
- 579కి పెరిగిన మృతుల సంఖ్య

**మహా :** నేపాల్‌లో రసువా జిల్లాలో కొన్ని అడుగుల ఎత్తున మొదలైన వరద, బురద ప్రవాహం పోటెత్తి దిగువకు ప్రవహించి పలు జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. పలు భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. వాహనాలు కాగితపు పడవల్లా కొట్టుకుపోయాయి. పరుగెత్తుతున్న ప్రజలను వరద కమ్మేసింది. జంతువులు, చెట్లు వరదలో కలిసిపోయాయి. భూకంపంతో మంచు, రాళ్లు, శిథిలాలు కొట్టుకొచ్చి లిండే నదిలో ప్రవాహానికి తాత్కాలికంగా అడ్డుపడ్డాయి. అడ్డంకి తొలగిపోగానే అది ఉప్పెనై భారీగా వరద, బురద దిగువకు పోటెత్తింది. అది భోటే కోశీ, త్రిశూలి నదుల ప్రవాహాన్ని బీభత్సం చేసింది. టిబెట్‌లోనూ వరద భారీ విధ్వంసం సృష్టించింది. భవనాలకు భవనాలే నేలమట్టమయ్యాయి. నేపాల్‌లో వరదల్లో మృతుల సంఖ్య 579కి చేరగా, ఏకంగా 1,924 మంది గల్లంతు అయ్యారని ఆ దేశ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.



# డీలిమిటేషన్ బిల్లుపై కేంద్రం బిగ్ ప్లాన్

## ముహూర్తం ఫిక్స్ !

- బిల్లు పునఃప్రవేశానికి వ్యూహం
- సెప్టెంబరు 8, 9న ప్రత్యేక భేటీ?
- మెజార్టీ కోసం బీజేపీ మంత్రాంగం
- మహిళా రిజర్వేషన్లపైనా కసరత్తు
- కేంద్రం వ్యూహంపై విపక్షాల్లో ఉత్కంఠ

**ఢిల్లీ, మహా :** మోదీ 4.0 లక్ష్యంగా కేంద్రప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. కొత్త వ్యూహాలకు రంగం సిద్ధమవుతోంది. సమీకరణాలు వేగంగా మారుతున్న వేళ.. విపక్షాలు అలర్ట్ అవుతున్నాయి. మహిళా రిజర్వేషన్లు.. డీలిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం కేంద్రంలోని ముఖ్య నేతలు కీలక మంత్రాంగం కొనసాగిస్తున్నారు. మరోసారి బిల్లు ప్రవేశ పెట్టటం ఆమోదం కోసం కసరత్తు జరుగుతోంది. ఇందుకు ముహూర్తం దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. కేంద్రం మరోసారి నియోజకవర్గాల పునర్విభజన ), మహిళా రిజర్వేషన్ల అంశం పైన కీలక మంత్రాంగం సాగిస్తోంది. ఇటీవల ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను ప్రభుత్వం ఇంకా అధికారికంగా ముగించకపోవడం వెనుక భారీ వ్యూహం కనిపిస్తోంది. డీలిమిటేషన్‌పై ప్రభుత్వానికి ఉన్న ప్రణాళిలను ప్రతిపక్షాలతో పంచుకోవాలని, మరో 25 ఏళ్లపాటు

మిగతా 3వ పేజీలో



# రాఖీ బంధం

సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన మంత్రి సురేఖ

సీతక్కతో కలిసి రేవంత్‌కు రాఖీ కట్టిన కొండా సురేఖ

సీఎం రేవంత్ ఆశీర్వాదం తమపై ఉండాలన్న మంత్రి

హైదరాబాద్, మహా : మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. రాఖీ పండగ సందర్భంగా మంత్రి సురేఖ, మరో మంత్రి సీతక్కతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టారు. అనంతరం ఏమీ మాట్లాడకుండానే రేవంత్ నివాసం నుంచి వెళ్లిపోయారు కొండా సురేఖ. తన కుమార్తె సుస్మిత వ్యాఖ్యలు, పరకాల వివాదం తర్వాత తొలిసారి సీఎం నివాసానికి వెళ్లడంతో చర్చనీయాంశమైంది. మంత్రి సురేఖ ముఖ్యమంత్రి నివాసం నుంచి వచ్చిన తర్వాత మీడియాతో మాట్లాడారు. ప్రతి ఏడాది మాదిరే ఈసారి కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి రాఖీ కట్టానని తెలిపారు. సీఎం కోసం ప్రత్యేకంగా చేయించిన బంగారు రాఖీ కట్టానని.. సీఎం అల్లుడు, మనవడికి కూడా రాఖీ కట్టినట్లు

మిగతా 2వ పేజీలో

### క్యూర్ పరిధిలో అత్యంత పారదర్శకంగా ఇందిరమ్మ టవర్స్ లక్కీడ్రా

- 16 నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా
- రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున ప్రక్రియ
- పేదలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత రిజిస్ట్రేషన్
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

02




### అదృష్టమంటే ఇదేనేమో లక్కీ డ్రాలో ఆసక్తికర ఘటన

02

### ప్రధాని నివాసంలో రక్షాబంధన్

పిల్లలతో రాఖీ పండుగ జరుపుకున్న ప్రధాని

సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు పోస్ట్

03

### రాష్ట్రంలో సైబర్, ఆర్థిక నేరాల తగ్గుదల

మాదక ద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి

- నేరాలపై లోతైన విశ్లేషణతోనే కట్టడి
- డీజీపీ సీవీ ఆనంద్
- అన్ని యూనిట్ల అధికారులతో అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశం

02





### హీరోయిన్ నిధి అగర్వాల్ చేతుల మీదుగా కొంపల్లిలో 'కలర్స్ 2.0' ప్రారంభం

**హైదరాబాద్, మహా :** ప్రముఖ హెల్త్ అండ్ వెల్‌నెస్ సంస్థ కలర్స్ హెల్త్‌కేర్ హైదరాబాద్‌లోని కొంపల్లిలో తన నూతన 'కలర్స్ 2.0' వెల్‌నెస్ సెంటర్‌ను ఘనంగా ప్రారంభించింది. హీరోయిన్ నిధి అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరై నూతన శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. ఈ రోజుల్లో సోషల్ మీడియా వల్ల అందంగా, ఫిట్‌గా కనిపించడం మరింత ముఖ్యాంశంగా

మిగతా 2వ పేజీలో



## హీరోయిన్ నిధి అగర్వాల్ చేతుల మీదుగా కొంపల్లిలో 'కలర్స్ 2.0' ప్రారంభం

( మొదటి పేజీ తరువాయి )

మారింది. కలర్స్ 2.0 లో లేటెస్ట్ టెక్నాలజీ, కొత్త మెషిన్లు, నిపుణులైన డాక్టర్లు ఉన్నారు. ఇలాంటి మంచి వాతావరణంలో హెల్త్, డైటింగ్ పై శ్రద్ధ పెడితే మరింత మోటివేషన్ లభిస్తుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అధునాతన వెల్‌నెస్ సదుపాయాలతో కలర్స్ 2.0 కొత్త కేంద్రాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కలర్స్ హెల్త్‌కేర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ.. ప్రజల మారుతున్న జీవనశైలి, ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొంపల్లి కేంద్రాన్ని అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు వారి అవసరాలకు అనుగుణంగా మెరుగైన వెల్‌నెస్ సేవలను అందించడమే లక్ష్యమన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని 5ఎం మీడియా ఆధ్వర్యంలో నిర్వహించగా, జయదీప్ పర్యవేక్షించారు.

## రాయదుర్గంలో మరోసారి రికార్డు ధర

- **ఎకరం రూ. 269 కోట్లకు పలికిన ప్రభుత్వ భూమి**

**రాయదుర్గం, మహా :** హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మరోసారి సరికొత్త రికార్డును సృష్టించాయి. రాయదుర్గంలో తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరం ధర ఏకంగా రూ. 269 కోట్లు పలికింది. ప్రముఖ నిర్మాణ సంస్థ వంశీరాం బిల్డర్స్ ఈ భూమిని అత్యధిక ధరకు దక్కించుకుంది. రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1 పరిధిలోని 5.38 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం వేలానికి ఉంచింది. దీనికి ఎకరానికి రూ. 175 కోట్లను ప్రభుత్వం కనీస ధరగా నిర్ణయించింది. అయితే, ఆన్‌లైన్ వేలంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల మధ్య తీవ్రమైన పోటీ నెలకొనడంతో ధర అనూహ్యంగా పెరిగింది. చివరికి ఎకరం రూ. 269 కోట్ల చొప్పున వంశీరాం బిల్డర్స్ ఈ స్థలాన్ని కైవసం చేసుకుంది. ఈ విక్రయం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 1,447 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. వారం రోజుల క్రితమే ఈ ప్రాంతానికి సమీపంలోని మరో ప్లాట్ ఎకరం రూ. 264 కోట్లకు అమ్ముడై రికార్డు సృష్టించగా, తాజా వేలం ఆ రికార్డును అధిగమించింది. రాయదుర్గం పరిసరాల్లో గత కొంతకాలంగా భూముల ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లో ఎకరం ధర రూ. 177 కోట్లు ఉండగా, ఈ ఏడాది మే నెలలో అది రూ. 237 కోట్లకు చేరింది. తాజాగా ఈ ధర రూ. 269 కోట్ల మైలురాయిని చేరుకోవడం గమనార్హం.



## రాఖీ బంధం

( మొదటి పేజీ తరువాయి )

తెలిపారు. అయితే తన కుమార్తె వ్యాఖ్యలు, పరకాల అంశంపై కొండా సురేఖ స్పందించలేదు.. పండగ రోజు రాజకీయ పరిణామాలపై మాట్లాడను అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులు మహిళలందరికి ఉండాలన్నారు. తాను అందరికి ఆడపడుచునని.. తనను వేరుగా చూడొద్దన్నారు మంత్రి కొండా సురేఖ. సీఎం పరకాల పర్యటన తర్వాత కొండా సురేఖ కుమార్తె సుస్మిత నేరుగా ముఖ్యమంత్రిపై విమర్శలు, ఆరోపణలు చేయడం చర్చనీయాంశమైంది.. కాంగ్రెస్ అధిష్ఠానం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. అనంతరం సుస్మిత వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని పీసీసీ క్రమశిక్షణా కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇచ్చింది. మంత్రి కూడా తన కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలినంటూ ఆ నోటీసుకు సమాధానం ఇచ్చారు. అయితే ఈ అంశంపై క్రమశిక్షణా కమిటీ రిపోర్ట్ ఇవ్వగా మంత్రి సురేఖపై చర్యలు తీసుకునే అవకాశం ఉందంటూ చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల మధ్య సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి మంత్రి కొండా సురేఖ వెళ్లడం ఆసక్తికరంగా మారింది.




## క్యూర్ పరిధిలో అత్యంత పారదర్శకంగా ఇందిరమ్మ టవర్స్ లక్కీడ్రా

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మహానగరంలో నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తూ, వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. అర్హతే ప్రామాణికంగా, కులమతాలు, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని స్పష్టం చేశారు. క్యూర్ ప్రాంతంలో తొలి విడతగా చేపడుతున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపునకు అత్యంత పారదర్శకంగా లక్కీడ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. మీడియా, అర్హులైన లబ్ధిదారుల సమక్షంలో లక్కీడ్రా నిర్వహిస్తూ, మొత్తం ప్రక్రియను అన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని చెప్పారు. శుక్రవారం నాంపల్లి, కుత్బుల్లాపూర్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కోసం లక్కీడ్రా నిర్వహించారు. నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్‌లో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కేటాయింపునకు వెట్ గార్డెన్స్‌లో, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవుపల్లి పరిధికి సంబంధించి లక్ష్మీగూడలో నిర్వహించిన లక్కీడ్రా కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని డ్రా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున లక్కీడ్రా ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఫ్లాట్లకు 600 మంది లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామని మంత్రి వివరించారు. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో తుది పరిశీలన నిర్వహిస్తారని, ఎంపికైన వారిలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలోని అర్హులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ విధానం ద్వారా అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13న కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేశారని, అనంతరం రికార్డు సమయంలోనే 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి టెండర్లు పిలవడం, మరోవైపు లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వానికి గొప్ప విజయమన్నారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, ఆయా నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సెప్టెంబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని మంత్రి వెల్లడించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 2 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు విడతల్లో అందిస్తోందని, చివరి విడత బిల్లుల చెల్లింపులు కూడా ప్రారంభమయ్యాయని వివరించారు. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసి, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. మరో పది రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తయ్యే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వానికి డబ్బు కూడబెట్టుకోవడం కంటే పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా సొంత ఇంటిని అందించడం ముఖ్యమని అన్నారు. ఎకరం రూ.100 కోట్లు, రూ.200 కోట్లు, రూ.300 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లోనూ పేద కుటుంబాలు గౌరవంగా జీవించాలని మంత్రి స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో సైబర్, ఆర్థిక నేరాల తగ్గుదల

- **మాదక ద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి**
- **నేరాలపై లోతైన విశ్లేషణతోనే కట్టడి**
- **డీజీపీ సీవీ ఆనంద్**
- **అన్ని యూనిట్ల అధికారులతో అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశం**




హైదరాబాద్, మహా : నేరాల దర్యాప్తు, పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. నేరాల సమీక్షను కేవలం గణాంకాలకే పరిమితం చేయకుండా.. ప్రతి నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధానం, దర్యాప్తు తీరు, కేసుల పరిష్కారాన్ని లోతుగా విశ్లేషించాలని అన్ని యూనిట్ల పోలీసు ఉన్నతాధికారులతో శుక్రవారం డిజిపి కార్యాలయంలో నిర్వహించిన అర్ధవార్షిక వార్షిక నేర సమీక్ష సమావేశంలో డీజీపీ దిశా నిర్దేశం చేశారు. ఇటీవలి కాలంలో సీసీటీఎన్ఎస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించడం వల్ల గతంలో 70-80 శాతంగా ఉన్న సీసీటీఎన్ఎస్ డేటా అప్‌డేట్.. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో 96 శాతానికి చేరడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి నెల నిర్వహించే క్రైమ్ రివ్యూ సమావేశాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ సూచించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు పాటించాల్సిన ప్రాథమిక విధానాలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రొఫెషనల్ స్టాండర్డ్స్‌ను పాటించడాన్ని అధికారులు పోటీగా తీసుకోవాలన్నారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాల పర్యటనలు, పోలీస్‌స్టేషన్ల తనిఖీల సమయంలో గుర్తించే అంశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. నేరాల ధోరణిని ముందుగానే గుర్తించి, అవసరమైన చోట ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

**మూడేళ్లలో రాష్ట్రంలో 7.15% పెరిగిన నేరాలు మాదకద్రవ్యాల కేసుల్లో 46.10% వృద్ధి.. సైబర్, ఆర్థిక నేరాల్లో తగ్గుదల**

రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య మూడేళ్లలో 7.15 శాతం పెరిగింది. 202324లో 2,65,377 కేసులు నమోదుకాగా.. 202526లో 2,84,363కు చేరాయి. లక్ష జనాభాకు నేరాల రేటు 481.58 నుంచి 491.59కి పెరిగింది. మాదకద్రవ్యాల కేసులు 202324లో 2,026 ఉండగా.. 202526లో 2,960కు చేరాయి. మూడేళ్లలో 46.10 శాతం పెరుగుదల నమోదైంది. వ్యవస్థీకృత నేరాలు 25 నుంచి 451కు పెరిగి 1,704 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ట్రాఫిక్ నేరాలు 29,130 నుంచి 31,891కు పెరిగి 9.48 శాతం వృద్ధి చెందాయి. మరోవైపు సైబర్ నేరాలు 25,373 నుంచి 22,000కు తగ్గి 13.29 శాతం, ఆర్థిక నేరాలు 37,690 నుంచి 32,684కు తగ్గి 13.28 శాతం క్షీణించాయి.

తీవ్ర నేరాల్లో 10.33% తగ్గుదల

తీవ్ర నేరాలు (గ్రేవ్ క్రైమ్) గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. 202425లో 7,019 కేసులు నమోదుకాగా.. 202526లో 6,294కు తగ్గాయి. ఏడాది వ్యవధిలో 10.33 శాతం తగ్గుదల నమోదైంది. లక్ష జనాభాకు నేరాల రేటు 11.21 నుంచి 10.88కు తగ్గింది. ప్రధాన కమిషనరేట్లలో హైదరాబాద్‌లో 1,483 నుంచి 1,094కు తగ్గి 26.23 శాతం క్షీణత నమోదైంది. సైబరాబాద్‌లో 656 నుంచి 613కు, మల్కాజిగిరిలో 664 నుంచి 549కు తగ్గాయి. అయితే కొన్ని జిల్లాల్లో తీవ్ర నేరాలు పెరిగాయి. ములుగులో 44 నుంచి 88కు, నిర్మల్‌లో 66 నుంచి 102కు, ఆదిలాబాద్‌లో 96 నుంచి 140కు చేరాయి. చిన్న, గిరిజన జిల్లాల్లో పెరుగుతున్న తీవ్ర నేరాలపై ప్రత్యేక దృష్టి అవసరమని గణాంకాలు సూచిస్తున్నాయి.

**ఏటేటా పెరుగుతున్న సాధారణ నేరాలు**

తీవ్ర నేరాలు తగ్గుతున్నప్పటికీ సాధారణ నేరాలు (నాన్‌గ్రేవ్) మాత్రం పెరుగుతున్నాయి. 202324లో 2,59,201గా ఉన్న కేసులు 202526లో 2,78,069కు చేరాయి. మూడేళ్లలో 7.28 శాతం పెరుగుదల నమోదైంది. కమిషనరేట్లలో ఫ్యూచర్ సిటీలో 23.70 శాతం, సైబరాబాద్‌లో 17.32 శాతం, మల్కాజిగిరిలో 13.53 శాతం పెరుగుదల నమోదైంది. హైదరాబాద్‌లో మాత్రం 2.77 శాతం తగ్గుదల కనిపించింది. జిల్లాల విషయానికి వస్తే కొమురం భీం ఆసిఫాబాద్‌లో 70.88 శాతం, ఆదిలాబాద్‌లో 60.71 శాతం పెరుగుదల నమోదైంది. మెదక్, సంగారెడ్డి, నల్గొండ, నారాయణపేట జిల్లాల్లోనూ సాధారణ నేరాలు పెరిగాయి.

**మహిళలు, చిన్నారులపై తగ్గిన నేరాలు**

202425లో 31,593గా ఉన్న మహిళలు, చిన్నారులపై నేరాలు 202526లో 31,108కు తగ్గాయి. ఏడాదిలో 1.54 శాతం క్షీణత నమోదైంది. అయితే 202324తో పోలిస్తే 3.81 శాతం ఎక్కువగా ఉన్నాయి. హైదరాబాద్, సైబరాబాద్, వరంగల్ కమిషనరేట్లలో కేసులు తగ్గగా.. ఫ్యూచర్ సిటీలో 790 నుంచి 994కు పెరిగాయి. జిల్లాల్లో ఖమ్మం, ఆదిలాబాద్, మహబూబాబాద్, నారాయణపేట, ములుగులో పెరుగుదల కనిపించింది.

**మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా**

రాష్ట్రంలో నార్కోటిక్ కేసుల పెరుగుదల పోలీస్ శాఖకు ప్రధాన సవాలుగా మారుతోంది. 202324లో 2,026 కేసులు ఉండగా.. 202526లో 2,960కు చేరాయి. లక్ష జనాభాకు నేరాల రేటు 3.68 నుంచి 5.12కు పెరిగింది. కమిషనరేట్లలో సైబరాబాద్‌లో 266 నుంచి 508కు చేరి 90.98 శాతం పెరుగుదల నమోదైంది. వరంగల్‌లోనూ మూడేళ్లలో 142.31 శాతం పెరిగాయి. జిల్లాల్లో ఆదిలాబాద్‌లో 57 నుంచి 219కు కేసులు పెరిగాయి. నేరాల రేటు 7.22 నుంచి 26.91కు చేరింది. నిజామాబాద్‌లో 62 నుంచి 123కు పెరిగాయి. నారాయణపేట, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లాల్లోనూ గణనీయమైన పెరుగుదల నమోదైంది. ఈ గణాంకల ప్రకారం మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా మూడేళ్లలో నార్కోటిక్ కేసులు 46.10% పెరుగుదల నమోదయింది.

**ట్రాఫిక్ నేరాలు 9.48% పెరుగుదల**

రాష్ట్రంలో ట్రాఫిక్ నేరాలు కూడా వరుసగా పెరుగుతున్నాయి. 202324లో 29,130 కేసులు ఉండగా.. 202526లో 31,891కు చేరాయి. మూడేళ్లలో 9.48 శాతం పెరిగాయి. సైబరాబాద్‌లో 2,882 నుంచి 3,677కు, మల్కాజిగిరిలో 3,213 నుంచి 3,673కు కేసులు పెరిగాయి. హైదరాబాద్‌లో స్వల్ప తగ్గుదల నమోదైంది. వరంగల్‌లో 8.27 శాతం తగ్గింది. జిల్లాల్లో కొమురం భీం ఆసిఫాబాద్‌లో 154 నుంచి 1,115కు చేరి 624.03 శాతం పెరుగుదల నమోదైంది. నిర్మల్‌లో 67.92 శాతం, నల్గొండలో 34.37 శాతం, ఆదిలాబాద్‌లో 28.30 శాతం పెరిగాయి. మరోవైపు భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, వికారాబాద్‌లో తగ్గుదల కనిపించింది.

సైబర్, ఆర్థిక నేరాల్లో ఊరట

సైబర్ నేరాలు 202425తో పోలిస్తే 202526లో 13.29 శాతం తగ్గాయి. ఆర్థిక నేరాల్లోనూ 13.28 శాతం తగ్గుదల నమోదైంది. ఈ రెండు విభాగాల్లో మూడేళ్ల కాలానికీ తగ్గుదల కనిపించడం సానుకూల పరిణామంగా పోలీస్ శాఖ భావిస్తోంది. మొత్తంగా రాష్ట్ర నేరాల సరళిని పరిశీలిస్తే.. తీవ్ర నేరాలు, సైబర్, ఆర్థిక నేరాల్లో తగ్గుదల కనిపిస్తున్నప్పటికీ మాదక ద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలు, సాధారణ నేరాలు, ట్రాఫిక్ నేరాల్లో పెరుగుదల నమోదైంది. ఈ నేపథ్యంలో నేరాలపై లోతైన విశ్లేషణ, నెలవారీ సమీక్షలు, క్షేత్రస్థాయి తనిఖీలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సమీక్షా సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

డిజిటల్ పోలీసింగ్ పోర్టళ్లలో సమాచారాన్ని నిర్ణీత గడువులోగా నవీకరించాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సమయానుకూలంగా, కచ్చితమైన సమాచారాన్ని నమోదు చేస్తున్న పోలీసు యూనిట్ల పనితీరును ఆయన అభినందించారు. ఇతర యూనిట్లు కూడా ఇదే విధానాన్ని పాటించి పనితీరును మెరుగుపర్చుకోవాలని సూచించారు. నేర నియంత్రణలో సాంకేతికత వినియోగంపై సమీక్షలో ప్రత్యేకంగా చర్చించారు. ఏఐ ఆధారిత పోలీసింగ్ అప్లికేషన్లు, సీసీటీఎన్ఎస్, టీజీకాప్, హాక్ఐ తదితర డిజిటల్ వేదికల పనితీరు, వినియోగంపై అధికారులు ప్రజెంటేషన్లు ఇచ్చారు. కొత్త నేర చట్టాల (ఎన్‌సీఎల్) అమలు, ఇంటర్‌ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ (ఐసీజేఎస్), సైబర్ నేరాల నియంత్రణ చర్యలు, ఈగల్ కార్యకలాపాలు, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) పనితీరు, కేసుల భారంపైనా సమీక్షించారు. యువ ఐపీఎస్ అధికారులు పోలీసింగ్‌లో చేపట్టిన నూతన ఆవిష్కరణలు, సాంకేతిక ఆధారిత కార్యక్రమాలను సమావేశంలో వివరించారు. పోలీసు శాఖ ఆర్థిక, బడ్జెట్ అంశాలు, పోలీసు గృహ నిర్మాణ ప్రాజెక్టులు, మౌలిక వసతుల అవసరాలు, కార్యకలాపాలకు సంబంధించిన అంశాలపైనా చర్చించారు. లొంగిపోయిన మావోయిస్టులకు సంబంధించిన అంశాలు, వారి పునరావాస చర్యలను కూడా సమీక్షించారు.

పోలీసు యూనిట్ల పనితీరుకు సంబంధించిన ఇతర అంశాలపైనా అధికారులు చర్చించారు. ఆయా యూనిట్లలో నెలకొన్న నేర పరిస్థితులకు అనుగుణంగా ప్రాధాన్యాలను ఎప్పటికప్పుడు మార్చుకోవాలని డీజీపీ సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితులను నిశితంగా పర్యవేక్షించాలని చెప్పారు. నేరాల నివారణ, ఛేదన, దర్యాప్తులో డేటా విశ్లేషణకు ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ స్పష్టం చేశారు. సమర్థమైన ప్రాథమిక పోలీసింగ్, సకాలంలో డేటా విశ్లేషణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నిరంతర పర్యవేక్షణతోనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. యూనిట్ స్థాయిలో జవాబుదారీతనం, సకాలంలో నిర్ణయాలు, క్షేత్రస్థాయిలో లక్ష్యిత చర్యలు నేర నియంత్రణను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశానికి డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, సీఐడీ డైరెక్టర్ శిఖా గోయెల్, ఉమెన్ సేఫ్టీ, సీఐడీ డైరెక్టర్ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా హాజరయ్యారు. రాష్ట్రంలోని అన్ని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

## మోహన్ భగవత్ వెళ్లొచ్చు రేవంత్ వెళ్లకూడదా?

**మోదీసర్కార్ పై సీపీఐ నారాయణ ఫైర్**

హైదరాబాద్, మహా : ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్‌కు లేని ఆంక్షలు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు ఎందుకని సీపీఐ జాతీయ నేత కె. నారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి యూఎస్ పర్యటనకు విదేశాంగ శాఖ 'పొలిటికల్ క్లియరెన్స్' నిరాకరించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపడుతూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమెరికా మత స్వేచ్ఛ కమిషన్ వీసా రద్దు చేయాలని కోరినా, న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీ వ్యతిరేకించినా మోహన్ భగవత్ న్యూయార్క్ చేరుకోగలిగారని నారాయణ గుర్తుచేశారు. అయితే, రాష్ట్రానికి పెట్టుబడులు, విద్యా సంస్థల సాధన, తెలంగాణ అభివృద్ధి కోసం వెళ్లాలనుకున్న సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడం ద్వంద్వ వైఖరి కాదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పర్యటనలో న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీని కలిసే అవకాశం ఉందన్న కారణంతోనే ఈ అనుమతి నిరాకరించారా..? అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన మేయర్‌ను ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి కలవడంలో అభ్యంతరం ఏమిటని, మమ్దానీ ఏమైనా నిషేధిత సంస్థకు చెందిన వ్యక్తా అని నిలదీశారు. ఆయనను కలవడం వల్ల దేశ ప్రయోజనాలకు ఎలాంటి విఘాతం కలుగుతుందో, మోడీ ప్రభుత్వానికి మమ్దానీని కలవడంపై ఎందుకు అంత భయమో కేంద్రం చెప్పాలన్నారు.



## జగన్‌ది దింపుడుకళ్లెం ఆశ

**స్థానిక ఎన్నికలపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు**

హైదరాబాద్, మహా : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగడం జగన్‌కు ఏమాత్రం ఇష్టం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఎస్సార్ సీపీ, మాజీ సీఎం జగన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జాప్యం జరిగేకొద్దీ అధికార కూటమికి నష్టం కలుగుతుందనే భ్రమలో జగన్ ఉన్నారని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. "ఇప్పటికే ఎస్ఏఆర్ వ్యవహారంలో వైసీపీ కోర్టుకు వెళ్లింది. ఎన్నికలు ఆలస్యమైతే తమకు లబ్ధి చేకూరుతుందని జగన్ ఆశపడుతున్నారు, కానీ అది దింపుడుకళ్లెం ఆశ మాత్రమే. ఈ విషయం ఆయనకు ఇప్పటికి కూడా అర్థం కావడం లేదు" అని పేర్కొన్నారు. పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత పారదర్శక పద్ధతిలో జరిగితేనే రాష్ట్ర రాజకీయ స్థిరత్వానికి నాంది పలికినట్లవుతుందని స్పష్టం చేశారు.

## దృష్టమంటే ఇదేనేమో లక్కీ డ్రాలో ఆసక్తికర ఘటన

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్‌లోని క్యూర్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపునకు లక్కీడ్రా ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవుపల్లి లక్ష్మీగూడలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. లక్కీ డ్రా టోకెన్‌ను ఓ బాలుడితో తీపించగా.. ఆ చిన్నోడి కుటుంబానికే ఇల్లు వరించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ వీడియోను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. పేదల సొంతింటి కల తీర్చాలనే ఈ ప్రభుత్వ సంకల్పానికి, దేవుడి ఆశీస్సులు తోడైనట్టు చిన్నోడు తీసిన లక్కీ డ్రాలో వారి కుటుంబానికే (జరపుల లక్ష్మీ) టోకెన్ రావడం తమ అందరినీ ఆనందానికి, ఆశ్చర్యానికి గురిచేసిందని మంత్రి పేర్కొన్నారు. "ఇలాంటి సందర్భాలు చాలా అరుదు. చిన్న పిల్లలు దేవుళ్లతో సమానం. చిన్నారులు స్వచ్ఛమైన మనసు కలిగినవారు. ఆ దేవుడి ఆశీర్వాదం, ప్రభుత్వ సహకారంతో వారి కల నెరవేరుతున్నందున ఆ కుటుంబం సొంతింటిలో జీవితాంతం చల్లగా బతకాలని, ఆ ఆడబిడ్డను ఆశీర్వదించాను'' అని పేర్కొంటూ వీడియోను షేర్ చేశారు. మరోవైపు, నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఫ్లాట్లకు 600 మంది లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామని, అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో తుది పరిశీలన చేస్తారన్నారు. వీరిలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలోని అర్హులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పొంగులేటి తెలిపారు. మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, ఆయా నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సెప్టెంబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.






## బంగాళాఖాతంలో అల్పపీడనం

**తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన ఐఎండీ అంచనాలివే**

హైదరాబాద్, మహా : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాబోయే 24 గంటల్లో మరో అల్పపీడనం బలపడనుంది. వాయువ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్ ఉత్తర ఒడిశా తీర ప్రాంతాల పరిధిలో శనివారానికి (ఆగస్టు 29, 2026) ఈ అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో రాగల కొద్ది రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

**ఏపీలోని జిల్లాలకు వర్ష సూచన**

అల్పపీడన ప్రభావంతో శనివారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. అలాగే ఉత్తరాంధ్రలోని మిగతా జిల్లాల్లో అక్కడక్కడ చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. వర్షాల సమయంలో ఉరుములు, పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు చెట్ల కింద నిలబడకూడదని అధికారులు హెచ్చరించారు.

**తెలంగాణలో తేలిక పాటి వర్షా లు**

ఆగస్టు 28 నుండి సెప్టెంబర్ 3 వరకు తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆగస్టు 28, 29 తేదీల్లో రాష్ట్రంలో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఆ తర్వాతి రోజుల్లో కూడా రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడ మోస్తరు వర్షాలు నమోదు కానున్నాయి. అయితే ఎలాంటి తీవ్రమైన ముప్పు హెచ్చరికలు లేవని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది.



## ప్రముఖ సినీ నటుడు నారాయణరావు సేవలు చిరస్మరణీయం

**ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సినీ రంగానికి కళా రంగానికి దివంగత ప్రముఖ సినీ నటుడు నిర్మాత జీవి నారాయణరావు అందించిన సేవలు చిరస్మరణీయమని ఆయన మరణం సినీ రంగానికి తీరని లోటని అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నారాయణరావు సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా మద్దెల శివకుమార్ మాట్లాడుతూ దాదాపు ఐదు దశాబ్దాల పాటు నారాయణరావు అందించిన నిస్వార్థమైన సేవలు అటు నాటక రంగానికి కళా రంగానికి ఇటు సినీ రంగానికి తీరని లోటు అని పేర్కొన్నారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న నారాయణరావు గుండెపోటుతో ఆకస్మిక మరణం పొందడాన్ని తనకు సన్నిహితులైన వారి మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలుగ చేసిందని ఎంతో బాధపడుతూ తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని కుటుంబ సభ్యులకు తెలియపరచినట్లుగా చెప్పారు. ఇటీవల తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆదర్శ ఫౌండేషన్ వారు హైదరాబాదులోని త్యాగరాయ గాన సభలో ఘనంగా నిర్వహించిన కళావేదికలోతెలంగాణ అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారి అతిరథ మహా రథుల చేతి మీదుగా తాను అభినవ మైటీ మెగాస్టార్ చిరంజీవి అవార్డును, అదే వేదికపై దివంగత నారాయణరావు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకోవడం తాను ఎంతో అదృష్టంగా భావించానని అప్పటినుండి వారితో సాన్నిత్యం ఉదాత్తమైన వారి వ్యక్తిత్వం తనను ఎంతో ఆకర్షించాయని తన ఆరాధ్య నటుడు మెగాస్టార్ చిరంజీవికి అత్యంత సన్నిహితుడిగా నారాయణరావు ఉన్నారని అంతలోనే పరమపదించడం ఎంతో విషాదకరమని ఆచార్య డాక్టర్ మద్దెల ఆవేదన చెందారు. నారాయణరావు ఆకస్మిక మృతికి ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు సంఘ నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ప్రముఖ సంగీత దర్శకులు మారపాక కృష్ణస్వామి, స్వర సంగీత విద్వాన్ సినీ గాయకులు కలవల రాందాస్, డి.సుధాకర్, పి.సురేందర్, గుండా రమేష్, సల్మాన్ ఖాన్ తోత, రాజేశ్వరరావులతో పాటు హైదరాబాదు నుండి ప్రత్యేకంగా శృతిలయ ఆర్ట్స్ అకాడమీ అధినేత గాన కోకిల ఆమని అక్కయ్య, ఆదర్శ ఫౌండేషన్ అధినేత నిత్య సమాజ సేవకులు కుసుమ భోగరాజ్, నివేదిత ఆర్ట్స్ అకాడమీ అధినేత స్వరకిరిటీ సుభాష్ తదితరులు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు.

# తుమ్మిడిహట్టిపై ఎక్కడా తగ్గొద్దు

( మొదటి పేజీ తరువాయి )

కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), గోదావరి నదీ యాజమాన్య బోర్డు వంటి వివిధ వేదికలపై రాష్ట్ర వాదనలను బలంగా వినిపించాలని సూచించారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌తో కొనసాగుతున్న జల వివాదాలపై అధికారులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేస్తూ తెలంగాణ వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని దిశానిర్దేశం చేశారు.



**తుమ్మిడిహట్టిపై చర్చ**

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై వచ్చేనెల 1న ఢిల్లీలో తెలంగాణ-మహారాష్ట్ర అధికారులతో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై సీఎం అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రాజెక్టు నిర్మాణం, బ్యారేజీ ఎత్తు, మహారాష్ట్ర అభ్యంతరాలు, గతంలో కుదిరిన ఒప్పందాలు తదితర అంశాలపై తెలంగాణ వాదనను బలంగా వినిపించేందుకు అవసరమైన సమాచారాన్ని సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకించి 148 మీటర్ల వద్ద నిర్మాణం చేపట్టడం వల్ల తెలంగాణకు కలిగే ప్రభావాలు, ప్రయోజనాలు, నష్టాలు, ప్రత్యామ్నాయ మార్గాలు తదితర అంశాలను కేంద్ర అధికారులకు సమగ్రంగా వివరించాలని సూచించినట్లు సమాచారం. మహారాష్ట్ర లేవనెత్తే ప్రతి అభ్యంతరానికి వాస్తవాలు, సాంకేతిక ఆధారాలతో సమాధానం ఇచ్చేలా సన్నద్ధం కావాలని సీఎం స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యారేజీని ముందుగా ప్రతిపాదించిన ఎత్తులోనే నిర్మించేలా అవగాహన కల్పించాలన్నారు. గతంలో జరిగిన ఒప్పందాలు, చర్చలు, పరస్పర అంగీకారాలు సమావేశంలో ప్రస్తావించాలని సీఎం సూచించారు. తుమ్మిడిహట్టి విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని, ఏ చిన్న అంశాన్ని విస్మరించకుండా సంపూర్ణంగా వాదన సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశానికి సంబంధించిన సన్నాహకాలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షించాలని సూచించినట్లు తెలిసింది.

**ఎక్కడా తగ్గొద్దు**

ఆంధ్రప్రదేశ్‌తెలంగాణ మధ్య కొనసాగుతున్న కృష్ణా జల వివాదాలపై వచ్చేనెల 7న కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో కీలక సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా బలమైన వాదనలు వినిపించాలని సీఎం ఆదేశించారు. కృష్ణా జలాల వినియోగం, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో నీటి విడుదల, నీటి పంపకాలు తదితర అంశాలపై తెలంగాణ వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. కృష్ణా జలాల విషయంలో ఏపీతో ఏళ్లుగా కొనసాగుతున్న వివాదాల నేపథ్యంలో సీడబ్ల్యూసీ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, ప్రాజెక్టుల నిర్వహణ, నీటి విడుదలకు సంబంధించిన అంశాల్లో రాష్ట్రానికి న్యాయం జరిగేలా సమగ్ర సమాచారంతో హాజరు కావాలని సీఎం సూచించినట్లు సమాచారం. ఇటీవల జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం తన అభ్యంతరాలను స్పష్టంగా వెల్లడించింది. 2027 ఆగస్టు వరకు తాగునీటి అవసరాల కోసం 112 టీఎంసీల నీటిని కేటాయించాలని తెలంగాణ కోరింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో తగినంత నీటి నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని బోర్డును కోరింది. మరోవైపు తాగునీటి అవసరాల కోసం ఏపీ 47 టీఎంసీల నీటిని కేటాయించాలని చేసిన ప్రతిపాదనపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇరు రాష్ట్రాల వాదనలు భిన్నంగా ఉండటంతో సమావేశంలో తుది నిర్ణయం తీసుకోకుండా వాయిదా పడింది. వచ్చేనెల 4న నిర్వహించనున్న తదుపరి కేఆర్ఎంబీ సమావేశంలోనూ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా వ్యవహరించాలని సీఎం అధికారులకు సూచించినట్లు తెలిసింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తాగునీటి అవసరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది.

**3రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా**

మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌తో తెలంగాణకు ఉన్న వివిధ జల వివాదాలకు సంబంధించిన కేసుల ప్రస్తుత పరిస్థితిపై సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుప్రీంకోర్టులో ఉన్న కేసులు ఏ దశలో ఉన్నాయి? ఇతర రాష్ట్రాలు ఏ వాదనలు వినిపిస్తున్నాయి? తెలంగాణ తరపున ఇప్పటివరకు ఎలాంటి వాదనలు వినిపించారు? భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహం ఏమిటి? అనే అంశాలపై సమీక్షించినట్లు సమాచారం. అలాగే.. కేంద్ర జల సంఘం, కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై సీఎం వివరాలు తెలుసుకున్నారు. న్యాయవాదులు, ఇంజినీరింగ్ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి రాష్ట్ర వాదనకు అవసరమైన సాంకేతిక, న్యాయపరమైన ఆధారాలను సిద్ధం చేయాలని సూచించారు. గోదావరి జలాల వినియోగం, వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులు, అంతర్రాష్ట్ర అంశాలపై మహారాష్ట్రతో ఉన్న వివాదాలపైనా సమావేశంలో చర్చించినట్లు సమాచారం. ప్రాజెక్టుల విషయంలో తెలంగాణ హక్కులు, నీటి వినియోగ సామర్థ్యం, గత ఒప్పందాలు, కేంద్ర సంస్థల నిర్ణయాలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సీఎం ఆదేశించారు. అంతర్రాష్ట్ర జల వివాదాల్లో ఒక్క వేదికలోనూ తెలంగాణ వాదన బలహీనపడకుండా సమగ్ర వ్యూహంతో ముందుకు వెళ్లాలని సీఎం స్పష్టం చేసినట్లు సమాచారం. సుప్రీంకోర్టు నుంచి సీడబ్ల్యూసీ వరకు, కేఆర్ఎంబీ నుంచి జీఆర్ఎంబీ వరకు ప్రతి వేదికపై రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేలా ఆధారాలతో కూడిన వాదనలు వినిపించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## ఆర్ఎఫ్ సిఎల్‌లో 40 ఉద్యోగాలు

**సెప్టెంబర్ 24 వరకు దరఖాస్తులకు అవకాశం**

**పెద్దపల్లి, మహా:** రామగుండం పరిధిలో నిరుద్యోగులకు రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ శుభవార్త అందించింది. అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్స్ కోసం వివిధ విభాగాల్లో మొత్తం 40 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.ఈ నియామకాల్లో రామగుండం యూనిట్‌లో 35 పోస్టులు, నోయిడాలోని కార్పొరేట్ కార్యాలయంలో 5 పోస్టులు భర్తీ చేయనున్నారు. కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, మెటీరియల్స్, ట్రాన్స్‌పోర్టేషన్, హెచ్ఆర్, మెడికల్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, ఐటీ తదితర విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి. ఇంజనీర్, ఆఫీసర్ , అసిస్టెంట్ మేనేజర్ , డిప్యూటీ మేనేజర్ , చీఫ్ మేనేజర్ , అడిషనల్ సీఎంఓ , సీఎంఓ తదితర హోదాల్లో పోస్టులు ఉన్నట్లు ఆర్ ఎఫ్ సి ఎల్ ప్రకటించింది. సంబంధిత విద్యార్హతలు, పని అనుభవం, వయోపరిమితి తదితర నిబంధనలు పోస్టును బట్టి మారుతాయి.ముఖ్యమైన తేదీలుఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఆగస్టు 26, 2026న ప్రారంభమైంది. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 24, 2026 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు పోస్టుల వారీగా విద్యార్హతలు, అనుభవం, వయోపరిమితి, జీతభత్యాలు, దరఖాస్తు విధానం తదితర పూర్తి వివరాలను RFCL అధికారిక వెబ్‌సైట్‌లోని కెరీర్స్ విభాగంలో పరిశీలించాలి.అధికారిక వెబ్‌సైట్: www.rfcl.co.in నియామకాలు సంస్థ నిర్దేశించిన అధికారిక ప్రక్రియ ద్వారానే జరుగుతాయని పేర్కొంది.




## పిడమర్తి రవికి రాఖీ కట్టిన సరికొండ రమణమ్మ

**తల్లాడ, ఆగస్టు 28 మహా**: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పిడమర్తి రవికి తల్లాడ మట్టమ్మ హోటల్ అధినేత సరికొండ రమణమ్మ రాఖీ కట్టారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా తల్లాడకు వచ్చిన ఆయనకు ఆమె రాఖీ కట్టి ఆప్యాయంగా పలకరించుకున్నారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా సోదర భావంతో రాఖి కడుతూ ఉండటంతో ఇరువురు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదేవిధంగా హోటల్లో మహిళలందరూ ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు వేమి రెడ్డి కృష్ణా రెడ్డి ఉన్నారు.కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పిడమర్తి రవికి తల్లాడ మట్టమ్మ హోటల్ అధినేత సరికొండ రమణమ్మ రాఖీ కట్టారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా తల్లాడకు వచ్చిన ఆయనకు ఆమె రాఖీ కట్టి ఆప్యాయంగా పలకరించుకున్నారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా సోదర భావంతో రాఖి కడుతూ ఉండటంతో ఇరువురు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదేవిధంగా హోటల్లో మహిళలందరూ ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు వేమి రెడ్డి కృష్ణారెడ్డి ఉన్నారు.

# డీలిమిటేషన్ బిల్లుపై కేంద్రం బిగ్ ప్లాన్

( మొదటి పేజీ తరువాయి )

లోక్‌సభ సీట్లను పెంచవద్దని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేఖ రాశారు. తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఆమ్ ఆద్మీ పార్టీలలో జరిగిన వరుస ఫిరాయింపుల నేపథ్యంలో, వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును తిరిగి ప్రవేశపెట్టాలని భావించినా.. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమంతో వెనక్కి తగ్గారు. ప్రస్తుతం తిరిగి ఈ బిల్లు ఆమోదం కోసం పూర్తి మెజారిటీని సాధించేందుకు పావులు కదుపుతోంది. ఇందు కోసం దాదాపు ముహూర్తం సైతం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీ త్వరలో జరిగే పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు.. బీజేపీ బలోపేతం లక్ష్యంగా కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు సిద్ధం అవుతున్నారు. దీనికి ముందే సెప్టెంబర్ 8,9 తేదీల్లో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. డీలిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం వ్యూహాలను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. గత ఏప్రిల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశాల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ రాక వీగిపోయిన డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులను మళ్లీ ఇదే సెషన్‌లో ముందుకు తెస్తారనే ప్రచారం జరుగుతోంది. తమిళనాడు సీఎం విజయ్ కూడా లోక్ సభ స్థానాలు పెంచకుండా మహిళా రిజర్వేషన్లు అమలుచేయాలని అసెంబ్లీ వేదికగా తీర్మానించారు. ఆప్, టీఎంసీ, శివసేన నుంచి చీలిక వర్గాల ఎంపీలతో పాటుగా డీఎంకే, ఎన్సీపీ పైనా బీజేపీ ఆశలు పెట్టుకుంది. ఇప్పటికే కావాల్సిన మెజార్టీ లెక్క పక్కా చేసుకున్న తరువాత ప్రత్యేక సమావేశాలకు సమాయత్తం అవుతున్నారని సమాచారం. దీంతో.. అన్ని అనుకున్నట్లుగా జరిగితే సెప్టెంబర్ తొలి వారంలోనే పార్లమెంట్ సమావేశాలు జరిగే అవకాశం కనిపిస్తోంది. దీంతో.. విపక్షాలు ఏం చేస్తాయనేది ఆసక్తిగా మారుతోంది.



## ప్రధాని నివాసంలో రక్షాబంధన్

న్యూఢిల్లీ, మహా : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం (ఆగస్టు 28) పిల్లలతో కలిసి రక్షాబంధన్ పండుగను జరుపుకున్నారు. ఆయన వారితో రాఖీలు కూడా కట్టించుకున్నారు. ఆయన వారితో ముచ్చటించి, రక్షాబంధన్ ఆనందాన్ని పంచుకున్నారు. 7, లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధానమంత్రి నివాసంలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో అనేకమంది పిల్లలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోలు, ఫోటోలను ప్రధాని మోదీ తన సోషల్ మీడియా ఖాతాలలో పంచుకున్నారు. ప్రధాని మోదీ పిల్లల మధ్య చాలా సౌకర్యవంతంగా, సంతోషంగా కనిపించారు. రక్షాబంధన్ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని తన శుభాకాంక్షలు కూడా తెలిపారు. రక్షాబంధన్ అన్నదమ్ముల, అక్కా చెల్లెళ్ల మధ్య ఉండే ప్రేమ, ఆప్యాయత, నమ్మకానికి ప్రతీక అని ఆయన అన్నారు. తన ఎక్స్ హ్యాండిల్‌లో ఒక పోస్ట్‌లో ప్రధాని మోదీ "రక్షా బంధన్ శుభాకాంక్షలు. ఈ పవిత్ర పండుగ మీ అందరికీ సంతోషాన్ని, శ్రేయస్సును, విజయాన్ని తీసుకురావాలని కోరుకుంటున్నాను. ప్రేమ, ఆప్యాయత, పరస్పర నమ్మకం అనే బంధం ఎప్పటికీ చెక్కుచెదరకుండా ఉండాలని ఆశిస్తున్నాను" అని పేర్కొన్నారు.





## అనుబంధాలకు ప్రతీక రాఖీ పౌర్ణమి

- **మహిళా సాధికారతకు కాంగ్రెస్ పెద్దపీట**
- **కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**
- **ఆరుట్లలో రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు**

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 28 మహా:** అన్నా చెల్లెళ్ళ అక్కా తమ్ముళ్ల అనుబంధాలకు ఔన్నత్యానికి ప్రతీక రాఖీ పౌర్ణమి అని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం రోజున రాఖీ పౌర్ణమి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్షకార్యదర్శులు నూకం బాలరాజు, చిందం శ్రీశైలంల ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆడపడుచులు మహిళలు మరియు మహిళా కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ నాయకులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... తమ సోదరుల శ్రేయస్సు కోరుతూ ఆడబిడ్డలు కట్టే ఈరాఖీల వలన అనుబంధాలు పెరగడమే కాకుండా సమాజంలో ఐక్యతా భావాన్ని అందరిని కలుపుకొని పోయే తాత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమనికి ప్రాధాన్యత ఇస్తూ, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, చెరుకు నర్సింహా, బుట్టి కృష్ణ, చిందం ఐలయ్య, మంద యాదగిరి రెడ్డి, ఆర్ల శ్రీకాంత్, దండ వెంకన్న, యూత్ కాంగ్రెస్ నాయకులు పంబాల కిషోర్, ఎండి అశ్రఫ్, గొరిగే కృష్ణ, దూసరి రాజు తదితరులు పాల్గొన్నారు.





## రాఖీ బంధం మరింత బలపడాలి..

- **ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి!**
- **గడ్డిఅన్నారం ఏఎంసి చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి**

**అబ్దుల్లాపూర్ మెట్టు ఆగస్టు 28 మహా**: రాఖీ బంధం మరింత బలపడాలి, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి అని, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. రాఖీ పండుగ సందర్భంగా ఆయన స్వగ్రామం అబ్దుల్లాపూర్ మెట్టు మండలం, అనాజ్ పూర్ లోని తన నివాసంలో అతని సోదరీమణులు మమతారెడ్డి, రూపారెడ్డిలు శుక్రవారం రాఖీ కట్టి తమ అనుబంధాన్ని, ఆత్మీయతను పంచుకున్నారు. ఈ సందర్భంగా చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.... అన్నా చెల్లెళ్ల ఆత్మీయతకు, అక్కా తమ్ముళ్ళ ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే పండుగ రాఖీ పండుగ అని అన్నారు. ఆడపడుచులు అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.



## పేదింటి ఆడబిడ్డకు వివాహ కానుక.!

- **పదివేల రూపాయలు అందించిన ఏఎంసీ డైరెక్టర్ రాజు**
- **ఖానాపూర్ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు**

ఇబ్రహీంపట్నం ఆగస్టు 28 మహా:పేదింటి ఆడబిడ్డకు వివాహ కానుకగా, ఏఎంసి డైరెక్టర్ దొంతరమోని రాజు, ఆడపడుచు కుటుంబ సభ్యులకు పదివేల రూపాయల అందించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పదవ వార్డు ఖానాపూర్ గ్రామానికి చెందిన, పండి మైసమ్మ యాదయ్యల కుమార్తె వివాహం ఈనెల 26న జరగగా, ఆ యొక్క ఆడపడుచు వివాహ కానుకగా, కౌన్సిలర్ ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం, శుక్రవారం రోజున పదివేల రూపాయలు అందించిన, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దొంతరమోని రాజు, మానవతా సహృదయాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో, ఖానాపూర్ అభివృద్ధి లక్ష్యంగా తన వంతు కృషి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాలనటిగా మొదలై.. హీరోయిన్‌గా
# మెప్పిస్తున్న అనిఖా

దక్షిణాది సినీ పరిశ్రమలో తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న యువ నటి అనిఖా సురేంద్రన్. బాలనటిగా వెండితెరకు పరిచయమైన ఆమె.. తన సహజమైన నటన, హావభావాలు, ఆకట్టుకునే స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకుంది. తాజాగా క్రీమ్ కలర్ చీరలో సంప్రదాయ అందంతో కనిపించిన అనిఖా ఫొటోలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చీరకట్టులో ఎంతో హుందాగా, ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్న ఆమె.. బాలనటి నుంచి కథానాయికగా ఎదిగిన తన సినీ ప్రయాణాన్ని ప్రతిబింబిస్తోంది.అనిఖా సురేంద్రన్ 2010లో మలయాళ చిత్రం 'కథ కొనసాగ'తో బాలనటిగా సినీ రంగ ప్రవేశం చేసింది. చిన్న వయసులోనే కెమెరా ముందుకు వచ్చిన ఆమె.. పాత్రకు తగిన భావోద్వేగాలను పలికించడంలో మంచి ప్రతిభను కనబరిచింది. ఆ తర్వాత మలయాళంతో పాటు తమిళ చిత్రాల్లోనూ అవకాశాలు అందుకుంటూ తన నటనకు మరింత పదును పెట్టుకుంది.
తమిళంలో 'ఎన్నై అరిందాల్', 'భాస్కర్ ది రాస్కల్', 'ది గ్రేట్ ఫాదర్', 'విశ్వాసం' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా 'విశ్వాసం' చిత్రంలో అజిత్ కుమార్తెగా కనిపించిన అనిఖా.. తన భావోద్వేగభరితమైన నటనతో ప్రత్యేక గుర్తింపు పొందింది. బాలనటిగా వరుస అవకాశాలు రావడంతో దక్షిణాది ప్రేక్షకులకు ఆమె పేరు మరింత చేరువైంది.
ఆ తర్వాత కథానాయికగా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు అడుగులు వేసింది. 2023లో విడుదలైన తెలుగు రొమాంటిక్ డ్రామా 'బుట్ట బొమ్మ'తో హీరోయిన్‌గా అరంగేట్రం చేసింది. మలయాళంలో విజయవంతమైన 'కప్పెల' చిత్రానికి అధికారిక రీమేక్‌గా తెరకెక్కిన ఈ సినిమా అనిఖా కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. బాలనటి ఇమేజ్ నుంచి హీరోయిన్‌గా మారే క్రమంలో ఈ చిత్రం ఆమెకు కొత్త అవకాశాలకు మార్గం చూపించింది.
హీరోయిన్‌గా పరిచయమైన తర్వాత కూడా అనిఖా విభిన్న కథలను ఎంచుకుంటూ ముందుకు సాగుతోంది. మలయాళంలో 'ఓ మై డార్లింగ్', 'కింగ్ ఆఫ్ కోతా' వంటి చిత్రాల్లో నటించింది. మరోవైపు తమిళ చిత్రాల్లోనూ వరుస అవకాశాలను అందుకుంటూ తన కెరీర్‌ను కొనసాగిస్తోందిtబాల నటిగా దాదాపు చిన్న వయసులోనే సినీ రంగంలోకి వచ్చిన అనిఖా.. ఇప్పటివరకు మలయాళం, తమిళం, తెలుగు భాషల్లో నటించి తన ప్రతిభను చాటుకుంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యమున్న విభిన్న పాత్రలను ఎంచుకోవడంపై ఆమె దృష్టి పెడుతోంది. భాష ఏదైనా పాత్రకు న్యాయం చేయాలనే ప్రయత్నంతో ముందుకు సాగుతోంది.
ప్రస్తుతం అనిఖా తమిళంలో తెరకెక్కుతున్న 'వాసువిన్ గర్భిణిగల్' చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా 2026లో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. రాబోయే రోజుల్లో మరిన్ని వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించేందుకు ఆమె సిద్ధమవుతోంది. బాలనటిగా ప్రారంభమైన ప్రయాణాన్ని విజయవంతమైన కథానాయికగా మలుచుకుంటున్న అనిఖా.. దక్షిణాది చిత్ర పరిశ్రమలో భవిష్యత్తులో మరింత మంచి అవకాశాలు అందుకునే యువ ప్రతిభగా నిలుస్తోంది.





# రాఖీ వేడుకల్లో సంజోష్ సేవా స్ఫూర్తి

సినిమాల్లో నటిస్తూనే సామాజిక సేవలోనూ తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్న యంగ్ హీరో సంజోష్ మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా శ్రీమాత బ్లైండ్ ఫౌండేషన్‌లోని దృష్టిలోపం ఉన్న యువతులతో కలిసి రాఖీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి అవసరాల కోసం గ్యాస్ స్టవ్‌ను అందించడంతో పాటు, అందరికీ ప్రత్యేకంగా భోజనం ఏర్పాటు చేశారు. "ఇక నుంచి మీరంతా నా సొంత చెల్లెళ్లే. మీకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నా వంతు సహాయం అందిస్తాను" అంటూ వారికి ధైర్యం చెప్పారు. గతంలోనూ శ్రీమాత బ్లైండ్ ఫౌండేషన్‌కు రెండుసార్లు భోజనాలు అందించడంతో పాటు ఫ్రిజ్‌ను విరాళంగా అందించారు.వరంగల్‌కు చెందిన సంజోష్ సినీ రంగంలో కుటుంబ కథాంశాలతో కూడిన చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులకు చేరువయ్యారు. సేవా కార్యక్రమాల కోసం 'సంజోష్ ఫౌండేషన్'ను ఏర్పాటు చేసి పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. మొబైల్ ఐ క్యాంపుల ద్వారా ఇప్పటివరకు 250 మందికి ఉచితంగా క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయించారు. అలాగే 118 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. వీటితో పాటు ముగ్గురు విద్యార్థుల విద్యాభ్యాసానికి సంబంధించిన పూర్తి బాధ్యతను స్వీకరించారు. "చిన్న పనులైనా గొప్ప ప్రేమతో చేయాలి" అనే ఆలోచనతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న సంజోష్‌పై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న
# 'ఇరుముడి'

మాస్ మహారాజా రవితేజ, దర్శకుడు శివ నిర్వాణ కాంబినేషన్‌లో తెరకెక్కిన తాజా చిత్రం 'ఇరుముడి' థియేటర్లలో విజయవంతంగా దూసుకెళ్తోంది. విడుదలైన తొలిరోజు నుంచే ప్రేక్షకుల నుంచి సానుకూల స్పందన అందుకున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతోంది. చిత్ర బృందం విడుదల చేసిన అధికారిక పోస్టర్ ప్రకారం.. తొలి వారంలోనే ప్రపంచవ్యాప్తంగా రూ.135 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు సాధించినట్లు ప్రకటించింది. దీంతో ఈ మూవీ ఘన విజయాన్ని సొంతం చేసుకుని 'హార్ట్ విన్నింగ్ బ్లాక్‌బస్టర్'గా నిలిచింది.తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో రవితేజ లుంగీ ధరించి, బయట బిందెతో నీళ్లు పోసుకుంటూ స్నానం చేస్తున్నట్లు కనిపిస్తున్నారు. ఈ లుక్ సినిమా నేపథ్యాన్ని, ఆయన పోషించిన పాత్ర స్వభావాన్ని ప్రతిబింబించేలా ఉంది. రవితేజ తనదైన మాస్ ఇమేజ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు.. మరోసారి తన బాక్సాఫీస్ సత్తాను చాటుకున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, టీసిరీస్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ నిర్మాతలుగా వ్యవహరించారు. భారీ స్థాయిలో తెరకెక్కిన ఈ సినిమాకు శివ నిర్వాణ దర్శకత్వం, కథ కథనంతో పాటు జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయి. ప్రేక్షకుల ఆదరణ కొనసాగితే రానున్న రోజుల్లో 'ఇరుముడి' మరిన్ని రికార్డులను సృష్టించే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.





## బంగారు చీరలో
# రాశి సింగ్

టాలీవుడ్‌లో తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకుంటున్న నటి రాశి సింగ్ తాజాగా సంప్రదాయ అందంతో అభిమానులను ఆకట్టుకుంది. బంగారు, నలుపు రంగుల కలయికతో కూడిన చీరలో మెరిసిన ఆమె ఫొటోషూట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. భారీ బంగారు ఆభరణాలు, సంప్రదాయ అలంకరణతో రాశి సింగ్ ఎంతో హుందాగా కనిపించింది. ఈ ఫొటోలకు సరదాగా స్పందిస్తూ.. 'నేను ఈ చీర కట్టుకున్న తర్వాతే బంగారం ధర పెరిగింది' అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ కూడా నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది.వెచ్చని రంగుల బ్యాక్‌డ్రాప్‌లో తీసిన ఈ ఫొటోషూట్‌లో రాశి సింగ్ రాజసం ఉట్టిపడేలా కనిపించింది. ప్రత్యేకంగా ఆమె ధరించిన బంగారు ఆభరణాలు, చీర డిజైన్, సంప్రదాయ మేకప్ మొత్తం కలిపి పాతకాలపు దేవాలయ శిల్పాల్లో కనిపించే నాయికను తలపించేలా చేశాయి. ఆమె చూపులు, హావభావాలు ఫొటోలకు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. ఈ ఫొటోలను టిడీఎఫ్ స్టూడియోజ్ తెరకెక్కించగా.. కుంతిగాంధారి సంస్థకు చెందిన చీరను రాశి ధరించింది. గోకులం సిగ్నేచర్ జువెల్స్ ఆభరణాలను అందించగా, స్టైలింగ్‌ను అన్నపూర్ణ, మేకప్‌ను రేష్మ, హెయిర్ స్టైలింగ్‌ను అర్కా మేకోవర్స్ నిర్వహించారు.ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్‌కు చెందిన రాశి సింగ్.. సినీ రంగంలోకి రాకముందు కొంతకాలం ఎయిర్‌హోస్టెస్‌గా పని చేసింది. ఆ తర్వాత నటనపై ఆసక్తితో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టింది. 2021లో 'శశి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఆది సాయికుమార్ హీరోగా నటించిన ఈ సినిమాలో సునీత పాత్రలో కనిపించిన రాశి.. తొలి చిత్రంతోనే తన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేసింది.ఆ తర్వాత వచ్చిన 'ప్రేమ్ కుమార్' చిత్రంతో మరింత గుర్తింపు సంపాదించింది. అనంతరం 2024లో విడుదలైన 'భూతద్దం భాస్కర్ నారాయణ' సినిమాలో లక్ష్మి పాత్రలో నటించి ప్రశంసలు అందుకుంది. అదే ఏడాది వచ్చిన థ్రిల్లర్ మూవీ 'ప్రసన్న వదనం'లో ఏసీపీ వైదేహి పాత్రలో కనిపించి మరోసారి తన నటనతో ఆకట్టుకుంది. గ్లామర్ పాత్రలతో పాటు కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లోనూ నటించగలనని ఈ చిత్రాల ద్వారా రాశి సింగ్ నిరూపించుకుంది.
ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో బిజీగా ఉన్న ఈ భామ.. 'బ్లైండ్ స్పాట్', 'పంచ్ మినార్', 'సంతాన ప్రాప్తిరస్తు', 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు', 'గాసిప్' తదితర చిత్రాల్లో నటిస్తోంది. అలాగే 'పాపం పసివాడు' వెబ్ సిరీస్‌లోనూ కనిపించి డిజిటల్ ప్రేక్షకులకు చేరువైంది. సినిమాలతో పాటు వెబ్ కంటెంట్‌లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటూ తన కెరీర్‌ను విస్తరించుకుంటోంది.ఇక రాశి సింగ్ కెరీర్‌లో మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ 'రంభ ఊర్వశి మేనక'. పౌరాణిక, ఫాంటసీ అంశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఆమె రంభ పాత్రలో కనిపించనుంది. పురాణాల్లో అందం, ఆకర్షణ, నృత్యంతో ప్రత్యేక స్థానం పొందిన రంభ పాత్రకు సరిపోయేలా రాశి సింగ్‌ను సంప్రదాయ అలంకరణలో చూపించనున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఆమె చేసిన బంగారు చీర ఫొటోషూట్‌ను చూసిన అభిమానులు.. ఈ లుక్ రంభ పాత్రకు అచ్చంగా సరిపోతుందని కామెంట్లు చేస్తున్నారు.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034